
రూ.3.50 కోట్లకు వడ్డీవ్యాపారి ఐపీ దాఖలు

చిత్తూరు లీగల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరుకు చెందిన ఓ వడ్డీ వ్యాపారి రూ.3.50 కోట్లకు ఐపీ దాఖలు చేశాడు. చిత్తూరు న్యూ బాలాజీ కాలనీలో నివాసముంటున్న ఓఎం నందకుమార్ పలు వ్యాపారాల నిమిత్తం తెలిసిన 105 మంది వద్ద రూ.3.50 కోట్లు తీసుకున్నాడు. వ్యాపారాల్లో నష్టం రావడంతో అప్పులు తీర్చడానికి స్తోమత లేదని, తనవద్ద రూ.1.50 కోట్ల విలువైన ఆస్తులు మాత్రమే ఉన్నాయని.. చిత్తూరు జిల్లా కోర్టు సముదాయంలోని అడిషినల్ సీనియర్ సివిల్ కోర్టులో ఐపీ దాఖలు చేశాడు. దీన్ని కోర్టు స్వీకరిస్తూ 105 మందికి నోటీసులు జారీచేయాలని ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో ఇతనికి డబ్బులు ఇచ్చిన వారంతా లబోదిబోమంటున్నారు.



పాము పగబడుతుందా? మనిషి పగబడతాడా??

నిజమేమిటంటే పాముకు పగబట్టే శక్తి లేదు. మనిషికే ఆ శక్తి ఉంది. పగబట్టి మరీ పాములను చంపేస్తుంటారు.

అందుకే.. 'పాముకు తలలోనే విషం.. మనిషికి నిలువెల్లా విషమే!' అనే సామెత పుట్టింది.

ఇంతకీ పామువల్ల మనిషికి ప్రమాదమా?

మనిషి వల్ల పాముకు నష్టమా??

మనిషి వల్ల పాముకే నష్టం పాపం!

కనిపిస్తే కొట్టి చంపేస్తారు. ఇది తప్పు.. పాము - పర్యావరణ సమతుల్యతలో చాలా ప్రాధాన్యంగలది అని చెప్పడానికే ఏటా జూన్ 16న వరల్డ్ స్నేక్ డే ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా శేషాచలంలో ఉండే పాములతో పాటూ, మన ప్రాంతంలో సంచరించే పాములూ వాటి లక్షణాల గురించి ప్రత్యేక కథనం..

- 4వ పేజీలో

టీచరే ప్రజెంట్... విద్యార్థులు ఆబ్సెంట్

పాఠశాల మార్పుపై అగ్రహారం దళిత వాడవాసుల ఆందోళన

- 5వ పేజీలో -

'హలో.. మేం గ్రామ సచివాలయం నుంచి మాట్లాడుతున్నాం. పీ4 పేరుతో ప్రభుత్వం ఓ సర్వే చేస్తోంది. మీ వివరాలన్నీ మేమే నింపుకున్నాం. మీ సెల్ ఫోన్‌కు ఓటీపీ పంపించాం. దాన్ని చెప్తే సరిపోతుంది.'

పీ4 కార్యక్రమంలో భాగంగా పేద కుటుంబాల్ని జిల్లావ్యాప్తంగా గుర్తించేందుకు చేపట్టిన సర్వే సాగిన తీరు ఇది. దీంతో ఉద్యోగం, సెల్‌ఫోన్, కరెంటు, నీళ్లు వంటి కనీస వసతులు లేని కుటుంబాలు ఏకంగా 65 వేలున్నట్లు జాబితా సిద్ధం చేసేశారు. దీంతో అసలు లక్ష్యం నీరు గారుతోంది.

పీ4 జాబితా పునఃపరిశీలన

- సర్వేలో ఏకంగా 65వేల బంగారు కుటుంబాల గుర్తింపు
- ఇష్టానుసారంగా సర్వే చేసిన సచివాలయ సిబ్బంది



చిత్తూరు, జూలై15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2047 నాటికి పేదరికం ఉండకూడదనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పీ4 కాన్సెప్టును తీసుకొచ్చారు. రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినా ఆయన ఈ విషయం గురించే మాట్లాడుతున్నారు. 1995లో ఆయన తొలిసారి సీఎం అయ్యాక సొంత గడ్డకు సేవ చేసుకునేందుకు తీసుకొచ్చిన 'జన్మభూమి'కార్యక్రమం పెద్దఎత్తున విజయవంతమైన విషయం తెలిసిందే. ఇప్పుడు అలాంటి పథకాన్నే పీ4 పేరుతో తీసుకొచ్చారు.ఇందులో భాగంగా అన్ని రకాలుగా అట్టడుగున ఉన్న కుటుంబాలను సర్వే ద్వారా గుర్తించి,వారిని ఉన్నతస్థాయి వ్యక్తులు ఆదుకునేలా చేయనున్నారు.

● నమ్మేలా లేని కుటుంబాల సంఖ్య

చిత్తూరు జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరిలో పీ4 సర్వే చేశారు.అయితే సచివాలయ సిబ్బంది ఇష్టానుసారం సర్వే చేసేసి సహాయానికి అర్హులుగా ఏకంగా 65,451 బంగారు కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. వాస్తవానికి బంగారు కుటుంబంగా గుర్తింపు రావాలంటే.. ఆ ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి, కరెంటు, నీళ్ల కనెక్షన్, సెల్‌ఫోన్, రేషన్‌కార్డు.. తదితరాలు ఉండకూడదు. నిజంగా సర్వే సక్రమంగా చేసి ఉంటే 65 వేల కుటుంబాలుండేవి కాదు. ఈ కాలంలో ప్రభుత్వ ఉద్యోగం లేని కుటుంబాలు ఉండొచ్చు కానీ, సెల్‌ఫోన్, కరెంటు, నీళ్లు వంటి కనీస మౌలిక వసతులు లేని కుటుంబాలు ఈ స్థాయిలో లేవు. 65 వేల కుటుంబాలు అన్నప్పుడే ఈ సర్వే సరిగా జరగలేదనేది స్పష్టమవుతోంది.

● ఈసారి పకడ్బందీగా..

బంగారు కుటుంబాల సంఖ్య ఎక్కువగా ఉండడంతో వారికి సాయం చేసే పారిశ్రామికవేత్తలను, ఎన్‌ఆర్‌ఐలను గుర్తించి ఒప్పించడం కష్టమవుతున్నట్లు తెలుస్తోంది.సర్వే మీద అనుమానాలుండడంతో ఆ 65 వేల కుటుంబాల జాబితాను పునఃపరిశీలించనున్నారు.రీవెరిఫికేషన్ ఎలా చేయాలనే అంశంపై ఈ నెల 17, 18 తేదీల్లో సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. జూలై 21వ తేదీ నుంచి ఆగస్టు 7 వరకు రీవెరిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉంది. ఈ సారి నిజంగా అర్హత కలిగిన పేద కుటుంబాల్నే గుర్తించేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. రీవెరిఫికేషన్ ఎలా చేయాలనే అంశంపై పలు సూచనలు చేశారు.

● మార్గదర్శుల కోసం ప్రణాళిక

రీవెరిఫికేషన్ పూర్తయ్యాక, తుది జాబితా ఆధారంగా మార్గదర్శుల్ని సంప్రదించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లాకు చెందిన బడా పారిశ్రామికవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలను సంప్రదించి బంగారు కుటుంబాలను ఆదుకోవాలని కోరనున్నారు.గుర్తించిన బంగారు కుటుంబాలల్ని దత్తత తీసుకున్న మార్గదర్శులు..... ఆయా కుటుంబాలకు అవసరమైన విద్య, వైద్యం, మౌలిక వసతుల్ని సమకూర్చనున్నారు.

డీఈఈ సెట్ అభ్యర్థులకు రేపటినుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వెదురుకుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డీఈఈ సెట్ 2025 పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 16వ తేదీ వరకు సీట్ల కేటాయింపునకు ఆన్‌లైన్ ద్వారా అవకాశం కల్పించినట్లు కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తర్వాత ఈ నెల 17 నుంచి 22వతేదీవరకు డైట్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఈనెల 25వ తేదీనుంచి తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

రూ.68 లక్షల నాన్ జ్యుడీషియల్ స్టాంపుల రాక

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నాన్ జ్యుడీషియల్ స్టాంపులు ఎట్టకేలకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరాయి. వీటిని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తరలిస్తున్నారు. రూ.68లక్షల విలువైన (48వేల రూ.100 స్టాంపులు, 40వేల రూ.50 స్టాంపులు) అందాయి. మూడు నెలలుగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. ప్రజలు రిజిస్ట్రేషన్లు, ఒప్పందాలకు ఈ స్టాంపులే వినియోగిస్తుంటారు. ఈ కొరతను అవకాశంగా తీసుకుని స్టాంపు వెండర్లు అధిక ధరలకు అమ్మకాలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వానికి ఇండెంట్ పంపడంతో ఈ మేరకు స్టాంపులు వచ్చాయి.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మహిళా మార్టులో అవకతవకలపై

ఇద్దరి సస్పెన్షన్

● సొమ్ము రికవరీకి కలెక్టర్ ఆదేశం

పెనుమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పెనుమూరు మహిళా మార్టులో అవకతవకలపై ఆడిట్ రిపోర్టు ఆదారంగా ఇద్దరిని సస్పెండ్ చేసి.. సొమ్ము రికవరీకి కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఆదేశించారు. మార్టులో అవకతవలకపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా ఈనెల 9వ తేదీన 'మా డబ్బులు ఏమయ్యాయి?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు విచారణ చేపట్టారు. వైసీపీ హయాంలో మార్టులో అమ్మకాలు రూ.4కోట్లకుపైగా జరిగి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. కొత్త ప్రభుత్వం రాగానే మార్టు నష్టాల్లో ఉందని.. అప్పటి మార్టు నిర్వాహకులు నివేదిక ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై డ్వాక్రా మహిళలు, ప్రజలు.. జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. సుమారు రూ.4కోట్లకుపైనే అమ్మకాలు జరిగితే అందులో 20 శాతంకంటే తక్కువ లాభం అనుకున్నా రూ.60 లక్షలైనా ఉండాలి. కానీ మార్టు బ్యాంకు ఖాతాలో లాభం అటుంచితే పెట్టుబడి రూ.60లక్షలు కూడా కనిపించలేదు. దాంతో డ్వాక్రా మహిళలు అవాక్కయ్యారు. ఈ వ్యవహారంపై రెండు నెలలపాటు ఆడిట్ బృందం పరిశీలించి.. కలెక్టర్‌కు నివేదిక ఇచ్చింది. ఈ రిపోర్టు ఆధారంగా సిబ్బందిని పిలిచి కలెక్టర్ ప్రశ్నించగా ఒక్కరూ నోరు మెదపలేదని సమాచారం. ఈ క్రమంలో ముగ్గురు డోబీలను, ఓ అకౌంటెంట్‌ను తొలగించమని ఏపీఎం, సీసీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నెల కిందట కలెక్టర్ ఆదేశించారు. నెల తర్వాత కూడా ఏపీఎం హరికృష్ణారెడ్డి, సీసీ యుగంధర్‌ల వివరణ సరిగా లేకపోవడంతో మంగళవారం వీరిద్దరినీ కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఆరుగురినీ బాధ్యులను చేస్తూ.. సొమ్మును రికవరీ చేయాలని ఆదేశాలిచ్చినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తెలిపారు.

22నుంచి ఇంటి నుంచే తపాలా శాఖ సేవలు

- 18 నుంచి 21వ తేదీవరకు తాత్కాలిక అంతరాయం
- చిత్తూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణ



చిత్తూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0తో అనేకరకాల సేవలను ఇంటి నుంచే సెల్‌ఫోన్ ద్వారా పొందే సౌలభ్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చిత్తూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణ తెలిపారు. మంగళవారం స్థానిక పోస్టల్ డివిజన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నూతన టెక్నాలజీని ఈనెల 22వ తేదీ నుంచి డివిజన్ పరిధిలోని 427 పోస్టాఫీసుల్లో ఈ సేవలను అమలు చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ఈనెల 18 నుంచి 21వ తేదీవరకు చిత్తూరు, మదనపల్లె హెడ్‌పోస్టాఫీసులతోపాటు చిత్తూరు డివిజన్‌లోని 21 సబ్‌పోస్టాఫీసులు, 374 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో అన్నిరకాల సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. అన్ని సేవలు ఈనెల 22వ తేదీన పునఃప్రాంభమవుతాయని వివరించారు. పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా పోస్టల్ శాఖలోనూ అనేక రకాల సేవలను అందించడానికి డాక్ సేవా యాప్ కూడా అమల్లో ఉందని గుర్తుచేశారు.

షాదీమహళ్ల నిర్మాణానికి రూ.2.4 కోట్లు మంజూరు



పలమనేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజకవర్గంలో షాదీమహళ్ల నిర్మాణానికి, మరో రెండు షాదీమహళ్ల ఆధునికీకరణ, మరమ్మతు పనులకు మైనారిటీ సంక్షేమ శాఖ రూ.2.4 కోట్లు మంజూరు చేసింది. గత టీడీపీ హయాంలో పలమనేరు, వి.కోట మండల కేంద్రాల్లో అప్పటి మంత్రి అమరనాథరెడ్డి షాదీమహళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శంఖు స్థాపనలు చేశారు. 2018లో కాంట్రాక్టరు పనులు ప్రారంభించారు. అయితే 2019 లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పూర్తిచేసేందుకు నిధులు విడుదల కాకపోవడంతో పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే షాదీమహళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రభుత్వంతో చర్చించారు. దీంతో పలమనేరు, వి.కోట ప్రాంతాల్లో అర్థాంతరంగా నిలిచిపోయిన షాదీమహళ్ల నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయడంతో పాటు పలమనేరులోని దండపల్లి రోడ్డు, జెండామఠంలోని షాదీమహళ్ల ఆధునికీకరణ పనుల కోసం ఒక్కో షాదీ మహల్‌కు రూ.20 లక్షల చొప్పున మైనారిటీ సంక్షేమ శాఖ మంజూరు చేసింది. దీనిపై ఇక్కడి ముస్లిం మైనారిటీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మాత్రమే మైనారిటీల సంక్షేమం జరుగుతోందని టీడీపీ మైనారిటీ సెల్ నాయకుడు ఖాజాపీర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చాంద్‌బాషా పేర్కొన్నారు.

19న తిరుపతికి చంద్రబాబు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 19న తిరుపతికి విచ్చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులోభాగంగా సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటనకు విచ్చేస్తున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం పాల్గొనే వేదికను సిద్ధం చేయడానికి మంగళవారం మధ్యాహ్నం దామినేడు సమీపంలోని తూకివాకం వద్ద తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన ఎస్‌డబ్ల్యూపీసీకేంద్రాన్ని, నగరంలోని ఎస్వీయూ స్టేడియం, ఎస్పీజేఎన్‌ఎం పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే వేదికను బుధవారం ఖరారు కానున్నట్లు ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రేపటి నుంచి పాలిసెట్ చివరిదశ కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్-2025 చివరి దశ కౌన్సెలింగ్ గురువారం నుంచి 20వ తేదీ వరకు ఉంటుందని జిల్లా కోఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించని విద్యార్థులు 17 నుంచి 19వ తేదీలోపు చెల్లించి కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చని సూచించారు. ఫీజు చెల్లించినవారు 18వ తేదీ నుంచి 20వ తేదీలోపు ఎంపికలు నమోదు చేసుకోవాలని సూచించారు.

యూరియా తిప్పలు

బంగారుపాళ్యం,జూలై 15 (ఆంధ్రజ్యోతి):యూరియా కొరతతో రైతులు గ్రోమోర్ కేంద్రం ఎదుట మూడు రోజులుగా మండే ఎండలో క్యూ కడుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వరిపైరు కలుపు తీయడానికి యూరియా అవసరం కావడంతో వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని యూరియా కొరత లేకుండా చూడాలని కోరుతున్నారు.



తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

వెదురుకుప్పం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం కార్వేటినగరం తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యవహారం మంగళవారం వెలుగు చూసింది.సీఐ హనుమంతప్పకు ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశామని తహసీల్దార్ నాగరాజు వెల్లడించారు. కార్వేటినగరం మండలంలో కొందరు గ్రామ కంఠం ధ్రువపత్రాల కోసం రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి, అధికారుల నకిలీ సీళ్లను వేస్తున్నారని తహసీల్దార్ తెలిపారు. ఈ క్రమంలో టీకేఎంపేట గ్రామానికి చెందిన కుమారస్వామి తన ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి రెవెన్యూ అధికారుల నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందాల్సి ఉందన్నారు. అయితే ఫోర్జరీ సంతకాలు పెట్టి అతనికి ధ్రువపత్రాలు మంజూరు చేసినట్లు గుర్తించామని చెప్పారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ ఎవరు? ఈ ప్రశ్నకు రెండు మూడు రోజుల్లో స్పష్టత రానున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై వారం రోజులుగా సాగుతున్న కసరత్తు తుది దశకు చేరుకుంది. అన్నీ సజావుగా సాగితే గురువారం చైర్మన్ పదవి ఎవరికి ఖరారైందన్న విషయాన్ని అధికారికంగా ప్రకటించనుంది అధిష్ఠానం. ఆశావహుల వడపోత, నేపథ్యాల పరిశీలన జరుగుతుండడంతో ఆశావహుల ప్రయత్నాలు జోరందుకున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

'ముక్కంటి' ఆలయ చైర్మన్ ఎవరు?

- మొదలైన కసరత్తు
- రెండు మూడు రోజుల్లో ప్రకటన
- అధినేత పరిశీలనలో పలువురి పేర్లు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచీ ఏడాది కాలంగా ముక్కంటి ఆలయ పాలకమండలి చైర్మన్ పదవి కోసం ఆశావహులు ఆత్రుతగా నిరీక్షిస్తున్నారు. రాష్ట్రంలోని 6-సి కేటగిరీ ఆలయాల్లో ఒకటైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి పౌరాణిక, చారిత్రక ప్రాధాన్యముంది. దానితో పాటే రోజువారీ భారీ సంఖ్యలో భక్తులు వచ్చే ఆలయం కావడం, రోజువారీ రూ.కోటికి పైగా ఆదాయం వున్న ఆలయం కావడంతో ప్రాముఖ్యం సంతరించుకుంది. అదే స్థాయిలో పాలకమండలి పదవికి తీవ్ర పోటీ కూడా వుంది. ఏడాదిగా ఆశావహులు ఎదురుచూపులు ఫలించే సమయం ఆసన్నం కావడంతో రకరకాల మార్గాల్లో తమ ప్రయత్నాలను ఉధృతం చేస్తున్నారు.



చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారి జాబితా పెద్దదే!

పాలకమండలి చైర్మన్ పదవిని ఆశించే వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్య నాయుడు ముందు వరుసలో వున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఆయన కుటుంబం పార్టీలో కొనసాగుతుండడంతో పాటు పార్టీకి, బొజ్జల కుటుంబానికి ఆయన నమ్మిన బంటుగా పేరుపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల వేధింపులకు గురి కావడం, సుమారు ఎనిమిది కేసులను ఎదుర్కొన్నారు. వీటన్నింటికీ మించి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సిఫారసు చేసిన ఏకైక పేరు ఈయనదే కావడం గమనార్హం. అలాగే మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తన వర్గం నుంచీ మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు ప్రవీణ్ పేరును అధిష్ఠానానికి ప్రతిపాదించారు. టీడీపీ నుంచీ సీనియర్ నేతలు రెడ్డివారి గురవారెడ్డి, దశరథాచారి కూడా పదవి ఆశిస్తున్నారు. వీరు నేరుగా అధిష్ఠానాన్నే నమ్ముకున్నారు. బీజేపీ ముఖ్యనేత కోలా ఆనంద్ తన కుటుంబసభ్యుల్లో ఒకరికి పదవి ఆశిస్తున్నట్టు సమాచారం. వీరు కాకుండా జనసేన నుంచీ మాజీ ఇన్‌ఛార్జి వినుత భర్త చంద్రబాబు పేరు కూడా అధిష్ఠానం పరిశీలనలో ఉండేది. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో జనసేన అధిష్ఠానం వారిని బహిష్కరించడం తెలిసిందే. తిరుపతికి చెందిన ఓ విద్యా సంస్థ అధినేత పేరు కూడా జనసేన తరఫున బలంగా వినిపిస్తోంది. అయితే స్థానికేతరులు కావడంతో వెనుకబడినట్టు సమాచారం. చెంచయ్యనాయుడికి పదవి కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధిష్ఠానం వద్ద గట్టిగా పట్టుబట్టినట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో అస్తవ్యస్తంగా వున్న ముక్కంటి ఆలయ నిర్వహణను తాను ప్రక్షాళన చేసి చక్కదిద్దానని, ఇపుడు తాను సూచించిన వ్యక్తినే పాలకమండలి చైర్మన్‌గా నియమిస్తే ఆలయ నిర్వహణ సక్రమంగా ఉంటుందని చెబుతున్నట్టు సమాచారం.

ఐవీఆర్‌ఎస్ సర్వే చేపట్టిన అధిష్ఠానం

ముక్కంటి ఆలయ పాలకమండలి చైర్మన్ పదవి ఖరారు చేసే ప్రక్రియ తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఐవీఆర్‌ఎస్ సర్వే చేపట్టినట్టు సమాచారం. ఈ సర్వేలో ఆశావహుల పేర్లు ప్రస్తావించి పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తోందని తెలిసింది. నేతల సిఫారసుల సంగతి పక్కన పెడితే ఐవీఆర్‌ఎస్ సర్వేలో వచ్చే ఫలితాలను బట్టే చైర్మన్ పదవికి తగిన ఆశావహుని ఎంపిక చేసే పరిస్థితి వుందని తెలిసింది. మొత్తానికీ రెండు మూడు రోజుల్లో వెలువడనున్న పాలకమండలి చైర్మన్ ఎంపిక ప్రకటన కోసం ఆశావహులతో పాటు కూటమి పార్టీల శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు సైతం ఆత్రుతగా వేచి చూస్తున్నారు.





దేశంలో ఉన్న పాముల జాతులు: 300, విషపూరితమైనవి: 60
అత్యంత విషపూరితం: ఇండియన్ కోబ్రా, నాగుపాము, రక్తపింజరి, కట్లపాము, గుడ్లపింజరి

శేషాచలంలో 35 రకాల పాములు

పా..పా..పాము!
ప్రమాదకరం కాదు

శేషులచలం : తిరుమల శేషాచలం కొండల్లో 35 రకాల పాములు ఉన్నాయి. వీటిల్లో కొన్ని అరుదైన జాతులు. అవి.. ఇండియన్ సాండ్ స్నేక్ (ఎర్ర ఇసుకబోతు), నాగార్జునసాగర్ రేసర్ (బోలావతి), శ్రీలంకన్ ఫ్లయింగ్ స్నేక్(గాలిలో ఎగిరే పసిరిక పాము), సన్నని పడగపు పాము(ఇది అంతరించి పోతోంది). అయితే శేషాచలంలోని సర్పజాతులపై ప్రత్యేకమైన పరిశోధనలు ఏవీ ఇంత దాకా జరగనే లేదు. అందువల్లే ఉన్న 35 రకాల పాములకు సంబంధించిన పూర్తి సమాచారం కూడా అందుబాటులో లేదు.

పాము కనిపించగానే ముందుగా ఒళ్లంతా పాములా జరజరా భయం పాకుతుంది. అది మీదకి వచ్చి కాటేసేస్తుందేమో అనే ఆందోళన కలుగుతుంది. విషపు కీటకం.. కొట్టి చంపేస్తేనే మేలు అనే అభిప్రాయానికి వస్తారు. కర్రతోనో, రాళ్లతోనో ఇక పాము మీద దాడి చేస్తారు. అది పారిపోయే ప్రయత్నం చేస్తుంది. దెబ్బ తగిలి తప్పించుకుంటే పాము పగబడుతుందనే నమ్మకంతో ఎట్లాగైనా చంపేయాలనే పట్టుదలతో పాము ప్రాణాలు తీసేస్తారు. ఆ తర్వాత మళ్లీ దానికి దహనక్రియలు చేస్తారు. పాలు పోస్తారు. దణ్ణం పెట్టుకుంటారు. దేవతగా ఒకవైపు పూజిస్తూనే కనిపిస్తే మాత్రం పామును కొట్టి చంపేసే విచిత్ర నైజం మనిషిది. మనిషిలోని భయమే పాము ప్రాణాలు తీస్తోంది. నిజానికి కనిపించేవన్నీ విషం కాదు. ఏది విషం, ఏది కాదు అని తెలిస్తే చాలు.. చాలా పాములు పాపం బతికిపోతాయి. ఈ రోజు స్నేక్ డే సందర్భంగా మన ప్రాంతంలో ఉండే పాములూ.. వాటి విశేషాలపై ప్రత్యేక కథనం..


కొండ చిలువ సైజు పెద్దదేగానీ విషం ఉండదు


విషపూరిత రక్త పింజర

WORLD SNAKE DAY

మాయా సర్పం: పూడుపాము

తరచూ మన ప్రాంతంలో వార్తల్లో ఉండేది పూడుపాము. దీనిని స్మగ్లింగ్ చేస్తూ పట్టుకున్నారు అని చదువుతూ ఉంటాం. విదేశాలకు దీనిని తరలిస్తుంటారని చెబుతారు. ఒక పాము విలువ కోటి దాకా పలుకుతుందని కూడా ప్రచారం. అయితే అసలు ఈ పాము ఎందుకు స్మగుల్ అవుతోంది? దీని వల్ల ఉపయోగాలు ఏమిటి అనే విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. దీనికి అతీంద్రియ శక్తులుంటాయనీ, ఇంట్లో పెట్టుకుంటే అదృష్టం అనీ, ఔషధ విలువలుంటాయనీ.. ఇలా రకరకాల ప్రచారాలున్నాయి. ఇవి నిజమో కాదో కూడా తెలీదు. అయినా ఇవి స్మగుల్ అవుతూ దొరుకుతూనే ఉన్నాయి. రెండు తలలున్నట్టుగా కనిపించే పూడుపాము ఎటువైపునకైనా కదులుతుంది. మన జిల్లాలో చాలా ప్రాంతాల్లో విస్తృతంగా ఇవి కనిపిస్తాయి. చురుగ్గా ఉండదు. మట్టిలో దాగి ఉంటుంది. ఇది విషపు పాము కాదు. అయినా కరిస్తే ఒళ్లంతా వికారంగా మచ్చలు వస్తాయని అంటారు. అందుకే మన ప్రాంతంలో ఎవరిమీదైనా కోపం ఉంటే 'వాడ్ని పూడుపాము కరవ' అని శాపనార్థం పెడతారు. మనదేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ పూడుపాములు ఉంటాయి. ఇరాన్, పాకిస్తాన్‌లలో కూడా కనిపిస్తాయి.



పాములను చంపొద్దు.. ప్లీజ్!

నిజానికి పాములు రైతులకు మిత్రులనే చెప్పాలి. రైతులు కష్టపడి పండించిన పంటలను ఎలుకలు, మిడతలు ఇతర కీటకాలు తిని ధ్వంసం చేయకుండా వాటిని ఆహారంగా తీసుకుని పాములు రైతులకు



మేలు చేస్తుంటాయి. పంట పొలాల్లో, అడవుల్లో, చెరువుల్లో కనిపించే పాములు అన్నీ విషంగల్లవి కావు. విషసర్పాలు కూడా మనిషి మీదకు రావు. వాటికి మనవల్ల ప్రమాదం అనిపిస్తేనే కాటేస్తాయి. కనిపించగానే భయపడి చంపేయకుండా స్నేక్ రెస్క్యూ టీంకి సమాచారం ఇస్తే పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేస్తారు. చంపేసుకుంటూ పోతే భూమ్మీద పాము అనేదే లేకుండా పోతుంది. ఇందువల్ల సమతుల్యత దెబ్బతింటుంది.

- లక్ష్మీ సౌజన్య, రమణ నాయక్, పాములపై పరిశోధకులు

మన సముద్ర జలాల్లో 16 రకాల పాములు

పాములు భూమ్మీద మాత్రమే కాదు సముద్రంలో కూడా ఉంటాయి. తరచూ మత్స్యకారుల వలల్లో పడుతుంటాయి. వీటిని తిరిగి నీళ్లలో వదిలేస్తుంటారు. తిరుపతి జిల్లాలో 16రకాల సముద్రపు పాములున్నాయని అంచనా. వీటిలో చాలా వరకు విషపూరితమైనవిగానే గుర్తించారు. తడ, వాకాడు, కోట సముద్ర తీర ప్రాంతాల్లో ఇవి మత్స్యకారులకు తారసపడుతుంటాయి. వాలుకుర్తిపాము, కస్తూరినాగపాము, హైడ్రోఫిష్ పాము, గలంగిరి, వాలగిరి, చంబాబు, నల్లదాసు పాములు ఎక్కువగా మన జిల్లాలోని సముద్ర జలాల్లో కనిపిస్తుంటాయి. అలాగే సముద్ర తీరంలోని ఇసుక ప్రాంతాల్లో ఇండియన్ సాండ్ బోవ(ఎరిక్స్ జోని), కాండనారస్, స్పాట్ సాండ్ స్నేక్ వంటి పాములు కనిపిస్తుంటాయి.ఇక తిరుపతి జిల్లాలో ఉన్న పులికాట్ సరస్సులో వాన పాములు, సేతుపాములు మాత్రమే ఉంటాయి. ఇవి విషపూరితం కాదు. ఇక్కడి వానపాము (ఎర్ర) సైజు చాలా పెద్దదిగా ఉంటుంది. అందుకే పెద్ద ఎత్తున వీటిని సేకరించి స్మగుల్ చేస్తుంటారు.

వాలంగిరితోనే ప్రమాదం

సముద్రంలో చేపలు పట్టేందుకు ఎన్నో తరాలుగా మేం వెళ్తూనే ఉన్నాం. వలలో చేపలతో పాటు కొన్ని పాములు కూడా పడుతుంటాయి. వాటిలో వాలంగిరి పాము అత్యంత విషపూరితమైంది. ఈ పాము కరిచి మా పూర్వీకులు చాలామంది మరణించారు. దీనికి మందు దొరకడం అరుదు. మిగతావి కరిచినప్పటికీ అంత ప్రమాదం ఉండదు.



- దక్షాది నటరాజన్, మత్స్యకారుడు, గోవిందపల్లి, కోటమండలం

స్నేక్ ఫ్రెండ్ : మనుషుల నుంచి ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా దాదాపు 18వేల పాముల్ని పట్టుకుని భద్రంగా అడవుల్లో వదలిపెట్టిన స్నేక్ ఫ్రెండ్ ఒకరు తిరుపతిలో ఉన్నారు. తిరుమల కొండమీద, తిరుపతిలోనూ పాము కనిపించిందని సమాచారం అందగానే ప్రత్యక్షమైపోతారాయన. అలవోకగా పట్టి బంధించి దూరంగా విడిచిపెట్టే భాస్కర్‌నాయుడు కూడా రెండు సార్లు పాముకాటుకి గురై ప్రాణాలమీదకు తెచ్చుకున్నారు. అయినా ఈ పనిని శ్రీవేంకటేశ్వరస్వామి తనకు అప్పగించిన బాధ్యతగా భావిస్తారు. 1982లో టీటీడీ అటవీశాఖలో కూలీగా చేరిన ఆయన ఆ తర్వాత స్నేక్ క్యాచర్‌గా మారిపోయారు. ఆయన కోసమే ఒక పోస్టును టీటీడీ ఏర్పాటు చేయడం విశేషం. రిటైరై పదేళ్లయినా ఆయనకు కాంట్రాక్టు పద్ధతిలో అదే పనిని టీటీడీ అప్పగించింది. జీవవైవిధ్య పురస్కారాలు ఎన్నో అందుకున్న 69 ఏళ్ల భాస్కర్ నాయుడుకి శేషాచలం అడవుల్లో ఉండే అనేక రకాల పాముల గురించిన అవగాహన ఉంది.

"పాము.. రోడ్డుమీద, పార్కులో లేదా ఇంట్లోకి వచ్చినా భయంతో కేకలు వేస్తూ హడావుడి చేయవద్దు. పాము మీదకి రాళ్ల, చేతికందిన వస్తువులు, మట్టి వంటివి అసలు వేయకూడదు. అలా చేస్తే తనకు ప్రమాదం అని భావించి ఆత్మరక్షణ కోసం పాము తిరగబడుతుంది. కాటేస్తుంది. శబ్దం చేయకుండా దూరం నుంచి దాని కదలికలు గమనించండి. మనుషుల ఉనికి ఉన్నతావులో పాము ఉండదు. పొరపాటున వచ్చినా దూరంగా వెళ్లిపోతుంది. ఒకవేళ అక్కడే ఉండిపోతే టీటీడీ సిబ్బందికి సమాచారం ఇస్తే చాలు.. నేను వచ్చి దానిని పట్టుకుని దూరంగా తీసుకువెళ్లి విడిచిపెడతాను."

- భాస్కర్ నాయుడు, టీటీడీ స్నేక్‌క్యాచర్



ప్రత్యేక కథనం
మంగళం, ఆంధ్రజ్యోతి

సత్యవేడుపై ఎంతమంది పెత్తనం?

- సమన్వయం మాట వదిలి సమస్యలు వస్తున్నాయన్న ఎమ్మెల్యే ఆదిమూలం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): 'ఒకరేమో పరిశీలకులు అంటారు. మరొకరు కో-ఆర్డినేటర్ అంటారు. ఇంకొకరు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అంటారు. సత్యవేడుపై ఇలా ఎంత మంది పెత్తనం చేస్తారు' అని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రశ్నించారు. పిచ్చాటూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సైకిల్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేగా తానుండగా మరొకరికి ఇన్‌చార్జి పదవి ఎందుకు? ప్రతి పక్ష ఎమ్మెల్యేలున్న చోట మాత్రమే అది సాధ్యమవుతుంది. ఇప్పటికైనా అపోహలు వీడి కుల, గ్రూపు రాజకీయాలకు స్వస్తి చెప్పి నియోజకవర్గ అభివృద్ధి కోసం సమష్టిగా ముందుకెళదాం' అని పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గంలో కుల గ్రూపు రాజకీయాలను సమన్వయం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయడం కోసం టీడీపీ అధిష్ఠానం శంకర్‌రెడ్డిని పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా నియమించిందే తప్ప ఇన్‌చార్జిగా కాదని మరోసారి ఆయన స్పష్టంచేశారు. శంకర్‌రెడ్డి తనకు మిత్రుడు, సన్నిహితుడైనా కొందరు నేతల మాటలు నమ్మి తన ఓటమికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే హేమలత, మరికొందరు గ్రూపు రాజకీయ నేతలతో కలిసి సభలు, సమావేశాలు, ప్రచార ఆర్భాటాలు చేయడం వల్ల ప్రభుత్వం ఆశించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం మరుగున పడిపోతోందన్నారు. దీంతో పార్టీలో సమన్వయం మాట పక్కన పెట్టి పలు సమస్యలు వస్తున్నాయన్నారు. రిజర్వుడు నియోజకవర్గంలో ఇలాంటి పెత్తనాలు చేస్తే అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడిచినట్లు అవుతుందన్నారు. అలాంటి పనులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహకరించరని ఆయన స్పష్టంచేశారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై ఉన్నానని, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తూ సీఎం చంద్రబాబుకు విధేయుడిగా ఉంటానని చెప్పారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, నీటి సంఘాల అధ్యక్షులు రవిరెడ్డి, పద్దురాజు, నాయకులు వాసురెడ్డి, డిల్లీ రాజేశ్వరి, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ రాక

- రేపు ఐఐటీలో ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం డిల్లీ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి తిరుచానూరు వద్దనున్న తాజ్‌హోటల్‌కు చేరుకుని బస చేస్తారు. గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి తాజ్ హోటల్‌కు చేరుకుంటారు. ఉదయం 11గంటలకు ఏర్పేడు వద్దనున్న ఐఐటీకి చేరుకుని ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం డిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు.

- వెయ్యి మంది కాదు 5 వేల మంది ఉన్నారు

తొలగించే దమ్ముందా?

- తిరుమలలో అన్యమతస్థుల అంశంపై చింతా మోహన్ సవాల్

తిరుపతి(వైద్యం), జూలై 15(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో వెయ్యి మంది కాదు.. ఐదువేల మంది అన్యమతస్థులు ఉన్నారు. భక్తుల సేవలో పారిశుధ్య పనులు చేస్తున్నారు. వారిని తొలగించే దమ్ము మీకుందా? తిరుపతి, తిరుమల గురించి మాట్లాడేందుకు బండి సంజయ్ ఎవరు?' అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఘాటుగా స్పందించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ముందు మంగళవారం ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. దేశంలో అభివృద్ధిని బీజేపీ నేతలు పక్కన పెట్టి, ఎప్పుడూ అన్యమతం.. అన్యమతస్థులు అంటూ పవిత్రమైన తిరుమలపై రచ్చ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని వివరించారు. నిరుద్యోగులు, పూట గడవని నిరుపేదల గురించి పట్టించుకోకుండా ఎప్పుడూ అన్యమతంపై మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. తిరుమలలో అన్యమతస్థులు ఎవరు.. ఏం పని చేస్తారో మీకు తెలుసా అంటూ ప్రశ్నించారు. మీరు చెప్పే అన్యమతస్థులే నిత్యం భక్తుల మల, మూత్రాలను శుభ్రం చేస్తూ, అతి తక్కువ జీతాలకు పనిచేస్తూ పొట్ట నింపుకుంటున్నారన్నారు. వారిని తొలగిస్తే తెలంగాణ నుంచి కార్మికులను తీసుకొచ్చి పని చేయిస్తారా అంటూ వ్యాఖ్యానించారు. తిరుమలలో కాంగ్రెస్ హయాంలో తప్ప తర్వాత ఈవో, డిప్యూటీ ఈవో స్థాయిలో ఎస్సీలను నియమించకపోవడాన్ని చూస్తే తిరుమలలో అంటరానితనం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్నతస్థాయిలో ఒక్క ఎస్సీ అధికారైనా తిరుమలలో ఉన్నారా అని ప్రభుత్వాన్ని అడిగారు. బ్యాంకుల రుణాల మాఫీ, ఎన్డీఏ పాలనలో జరిగిన రూ. లక్ష కోట్ల అవినీతిపై బండి సంజయ్ మాట్లాడితే బాగుంటుందన్నారు. టీటీడీలో పనిచేసే అర్చకులకు, శాశ్వత ఉద్యోగులకు 5 సెంట్ల నివాస స్థలాన్ని ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు యార్లపల్లి గోపీగౌడ్, రవి, తేజోవతి, మునిశోభ తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ పరిపాలన భవనం ముందు నిరసన తెలుపుతున్న చింతా మోహన్

ఎస్వీయూలో చిరుతల కలకలం

మంగళం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో చిరుతలు విద్యార్థులు, ప్రజలను భయపెడుతున్నాయి. క్వార్టర్స్‌లోని పెంపుడు శునకాలను, వర్సిటీ సమీప ప్రాంతాల్లో ఉండే శునకాలను చిరుతలు వదలడంలేదు. చీకటి పడితే చాలు శేషాచల అటవీప్రాంతం నుంచి రీజనల్ సైన్స్‌సెంటర్ సమీప అటవీప్రాంతాల మీదుగా ఎస్వీ యూనివర్సిటీ, వేదిక్, వెటర్నరీయూనివర్సిటీ ప్రాంతాలకు చేరుకుంటున్నాయి. ఇక్కడ సమీప ప్రాంతాల్లోని హాస్టల్ వద్ద వేసిన ఆహారం కోసం శునకాలు వస్తుంటాయి. అయితే అప్పటికే మాటు వేసిన చిరుతలు వీటిని చంపితిని తిరిగి అడువుల్లోకి వెళ్లిపోతుంటాయి. అలా వాటికి ఆహారం దొరకనిప క్షంలో వర్సిటీలోని క్వాటర్స్, హాస్టళ్ల వద్దకు వస్తున్నాయి. గత వారం రోజులుగా రెండు చిరుతుల సంచరిస్తుండటాన్ని విద్యార్థులతో పాటు హాస్టల్స్‌సిబ్బంది , స్థానిక ప్రజలు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ అధికారులు మూడు ప్రాంతాల్లో బోన్లను కూడా ఏర్పాటు చేశారు. అలాగే చిరుతలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో 10 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు రాత్రి పూట ఆరుగురు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అయితే చిరుతల వల్ల ప్రమాదం ఎటువైపు నుంచి ముంచుకువస్తుందో అన్న భయంతోవిద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.


ఎస్వీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కెమెరాకు చిక్కిన చిరుత


ఎస్వీ యూనివర్సిటీలో చిరుతల కోసం అటవీశాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన బోను

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.72 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,149
తలనీలాలు సమర్పించినవారు: 29,066

192 ఎర్రచందనం దుంగల స్వాధీనం

నలుగురు స్మగ్లర్ల అరెస్టు

- కారు, మోటారు సైకిల్ స్వాధీనం

మంగళం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా చేజర్ల అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి 192 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ మోటారు సైకిల్, ఒక కారును సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం, స్థానిక ఎఫ్‌బీవో జనార్దన్‌తో కలిసి మంగళవారం నెల్లూరుజిల్లా చేజర్ల అటవీప్రాంతంలోని కలువాయి ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఒక కారు, ఒక మోటారు సైకిల్‌తో కొందరు గుమికూడిపోలీసులక కంటపడ్డారు. వారిని చుట్టుముట్టి పట్టుకునే ప్రయత్నం చేయగా వారు పారిపోయారు. అయితే టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వీరిలో ఇద్దరు తమిళనాడుకు చెందివారు, మరో ఇద్దరు నెల్లూరు జిల్లాకు చెందివారుగా గుర్తించారు. కారులో లోడ్ చేసిన ఎర్రచందనం దుంగలతో పాటు సమీపంలో దుంగలను రీపర్లు, పలకలుగా మార్చి దాచి ఉంచిన వాటితో సహా 192 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.50లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుబడ్డ స్మగ్లర్లను వాహనాలతో సహా ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

టీచరే ప్రజెంట్... విద్యార్థులు ఆబ్సెంట్..!

● పాఠశాల మార్పుపై అగ్రహారం దళితవాడవాసుల ఆందోళన

గంగాధరనెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలం పాత వెంకటాపురం పంచాయతీ పరిధిలోని అగ్రహారం దళితవాడకు చెందిన 32మంది విద్యార్థులను సుమారు నెలకు పైగా స్కూలుకు పంపకుండా తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. అగ్రహారం దళితవాడలోని స్కూల్లో గత ఏడాది 1 నుంచి 5వతరగతి వరకు 34మంది విద్యార్థులు చదువుకున్నారు. ఇద్దరు టీచర్లు రంజిత్‌కుమార్, డేనియల్ టెన్నిసన్ విధులు నిర్వహించేవారు. అయితే ఈసారి ఆ స్కూల్లో 3,4,5 తరగతులకు చెందిన 23మంది విద్యార్థులను కొత్తవెంకటాపురంలోని మోడల్ స్కూలుకు కలపడంతో ఇక్కడ 1,2 తరగతులకు చెందిన 9మంది విద్యార్థులే మిగిలారు. కొత్తవెంకటాపురం స్కూల్లోని 37మంది ,అగ్రహారం దళితవాడ స్కూల్లోని 3,4,5 తరగతులకు చెందిన 23మంది విద్యార్థులను మోడల్‌స్కూలుకు అప్పటి అధికారులు కలిపేసి మ్యాపింగ్ చేశారు. కాబట్టి అగ్రహారం దళితవాడకు చెందిన విద్యార్థుల్లో 1,2 తరగతులు విద్యార్థులు మాత్రమే ఈ స్కూలుకు రావాల్సి ఉంటుందని, 3,4,5 తరగతులకు చెందిన విద్యార్థులు మోడల్‌స్కూలుకు పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులకు టీచర్లు సమాచారం ఇచ్చారు. రెండు తరగతులే వుంటాయి కాబట్టి ఓ టీచర్ పోస్టును రద్దు చేశారు. టీచర్ రంజిత్‌కుమార్ మాత్రమే అగ్రహారం దళితవాడ స్కూలుకు గత నెల 12వ తేదీ నుంచి విధులకు హాజరవుతున్నారు.అయితే అగ్రహారం దళితవాడ స్కూల్లో 5తరగతులనూ కొనసాగిస్తేనే తమ పిల్లలను స్కూలుకు పంపిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతూ వస్తున్నారు. లేదంటే 3,4,5 తరగతులకు చెందిన విద్యార్థులను కొత్తవెంకటాపురం మోడల్‌స్కూలుకు కూడా పంపేది లేదంటున్నారు.తమ అనుమతి తీసుకోకుండానే అధికారులు 3,4,5 తరగతుల విద్యార్థులను కొత్తవెంకటాపురం స్కూల్‌కు ఎలా కలిపేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఎంఈవో గుణశేఖర రెడ్డి మొదలుకుని డీఈవో వరలక్ష్మి , జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే థామస్ దాకా వినతిపత్రాలు అందజేసి తమ వూర్లోని స్కూల్లో ఒకటి నుంచీ 5వ తరగతి దాకా కొనసాగించాలని వినతి పత్రాలు సమర్పించారు. మూడురోజుల క్రితం మండలంలోని నెల్లేపల్లె పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలసి కూడా విన్నవించారు.


తరగతి గదిలో టీచరు రంజిత్‌కుమార్


చెట్టు కింద ఆట్లాడుకుంటున్న విద్యార్థులు

మా పిల్లల భవిష్యత్ ఏంకావాలి?

మా వూరి పిల్లలు నెలరోజులకు పైగా చదువుకు దూరంగా ఉంటే వారి భవిష్యత్ ఏంకావాలి? విద్యార్థుల తల్లిదండ్రుల అనుమతిలేకుండా ఇతర స్కూళ్లకు ఏవిధంగా కలిపేస్తారు?మా సమస్యను పరిష్కరించమని నెలరోజులుగా అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

- మైకేల్‌రాజ్ ,విద్యాకమిటీ చైర్మన్.

నిబంధనల మేరకే మోడల్‌స్కూలు ఏర్పాటు

ప్రభుత్వ నిబంధనల మేరకే కొత్తవెంకటాపురంలో మోడల్‌స్కూలు ఏర్పాటు చేశాం.అగ్రహారం దళితవాడ స్కూలు కిలోమీటరు దూరంలో ఉన్నందున అక్కడ చదివే 3,4,5 తరగతుల విద్యార్థులను మోడల్‌స్కూలుకు కలిపాం. విద్యార్థుల రాకపోకల కోసం ఆటో ఏర్పాటు చేయిస్తాం. విద్యార్థుల తల్లిదండ్రులే పునరాలోచించి మోడల్‌స్కూల్‌కు పిల్లలను పంపించేందుకు సహకరించాలి.

- గుణశేఖరరెడ్డి, ఎంఈవో

పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా.. ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోనే ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కడా సంయుక్త ఆధ్వర్యంలో కడా కార్యాలయంలో మంగళవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకించి కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పలు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆరు పరిశ్రమలు వచ్చాయని, ఇంకా మరికొన్నింటితో ఎంఓయూలు కుదిరాయని చెప్పారు. రాబోయే రెండేళ్లలో ప్రముఖ పరిశ్రమలు కుప్పం నియోజకవర్గంలో ఏర్పడుతాయని, నిరుద్యోగ సమస్య తొలగి ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సిన దుస్థితి తప్పుతుందన్నారు. అలీప్ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. ఎవరు ఏ పరిశ్రమ స్థాపించాలనుకుంటే శిక్షణ ఇవ్వడమే కాకుండా బ్యాంకు రుణాలు ఇప్పించి, వారిని పారిశ్రామిక వేత్తలుగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ ఎందరో యువత, మహిళలు పరిశ్రమల స్థాపనకు ఉత్సాహంగా ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే అలీప్ సంస్థకు కుప్పంలో 20 ఎకరాలు కేటాయించామని, అక్కడ శిక్షణతోపాటు ఇతర ప్రోత్సాహక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని పరిశ్రమలు స్థాపించి, ఉన్నత ఎత్తులకు కుప్పం యువత, మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా సలహా మండలి సభ్యుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కడా సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో యువతికి గాయాలు


చికిత్స పొందుతున్న మీనాక్షి

కుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం వి.మిట్టపల్లె గ్రామంలో మంగళవారం అడవి పందుల దాడిలో మీనాక్షి అనే యువతికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. వి.మిట్టపల్లె గ్రామానికి చెందిన మీనాక్షి తన సోదరితో కలిసి మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని పొలానికి గడ్డి కోయడానికి వెళ్లింది. గడ్డి కోసే సమయంలో సమీపంలోని చెరుకు తోట వెనుక నుంచి అడవి పంది కుక్కను తరుముకుంటూ వీరివైపు వచ్చింది. గడ్డి కోస్తున్న మీనాక్షిపై దాడిచేసింది. దాడిలో ఆమె కుడికాలికి గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను కుప్పం ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సమాచారం అందుకున్న కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్, డీఆర్వో సమీర్‌బాషా ఆస్పత్రికి చేరుకుని మీనాక్షిని పరామర్శించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ఎఫ్ఆర్వో జయశంకర్ మాట్లాడుతూ మీనాక్షిపై దాడి చేసింది ఏ జంతువు అనేది డాక్టర్ ఇచ్చే సర్టిఫికెట్‌తో స్పష్టం కావాలని చెప్పారు. ఈ సంఘటనపై డీఎఫ్‌వో భరణికి నివేదిక పంపామని, ఆమె ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్యూటీషియన్, రీటైల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించనున్న బ్యూటీషియన్, రీటైల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి దొణప్ప ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18-35 ఏళ్లలోపున్న స్త్రీ, పురుషులు గురువారం ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరవ్వాలన్నారు. కోర్సు పూర్తిచేసినవారికి తామే ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8328 677983, 76710 66532 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతతో పనిచేయాలి: కలెక్టర్


మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మున్సిపల్ కమిషనర్లతో ఆదాయ, వ్యయాలపై కలెక్టర్ సమీక్షించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత కమిషనర్లదే అన్నారు. నిధులకు ఎలాంటి కొరత లేదని చెబుతూ మున్సిపాలిటీల ద్వారా ఆదాయం ప్రభుత్వ ఖజానాకు అందేవిధంగా కృషిచేయాలన్నారు. పుంగనూరు, పలమనేరు మునిసిపాలిటీల్లో ఉన్న ఏరియా ఆస్పత్రులను రోజూ తనిఖీలు చేయాలని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా పట్టణ ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్లు లీకేజీ లేకుండా మరమ్మతులు చేయాలన్నారు. డెంగీ, మలేరియా, చికన్‌గున్యా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బస్సుల రిపేర్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

● ఆర్టీసీ అధికారులకు ఈడీ ఆదేశం


ఆర్టీసీ టూడిపోలో అధికారులు, కార్మికులతో మాట్లాడుతున్న ఈడీ చంద్రశేఖర్

చిత్తూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బస్సుల రిపేర్లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని అధికారులను ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం చిత్తూరు ఆర్టీసీ వన్, టూ డిపోలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీటీవో రాము, డీఎంలతో సమావేశం నిర్వహించారు. అవసరాలకు తగ్గట్టుగా బస్సుల శాతాన్ని పెంచాలన్నారు. రానున్న రోజుల్లో ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుందని.. బస్సుల్లో ఫుట్‌బోర్డు, హ్యాంగింగ్ రాడ్లను బలమైనవిగా అమర్చాలని సూచించారు. అనంతరం గ్యారేజ్‌ను తనిఖీ చేసి, కార్మికులతో మాట్లాడారు. తర్వాత ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వన్, టూ డిపో మేనేజర్లు కృష్ణమూర్తి, రూపశ్రీ, సీఐ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పులిగుండుపై పర్యాటక శాఖ దృష్టి


సర్వే చేస్తున్న అధికారులు

పెనుమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రమైన పులిగుండుపై రాష్ట్ర టూరిజం శాఖ దృష్టి సారించింది. ఇటీవల పులిగుండ వద్ద 2,300 మందితో యోగా డే నిర్వహించిన ఫొటోలను రాష్ట్ర టూరిజం శాఖ తమ అధికారిక ఎక్స్‌లో అప్లోడ్ చేసింది. దీనికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ట్యాగ్ చేస్తూ.. ప్రశంసలు కురిపించారు. దాంతో పులిగుండ ప్రదేశంపై రాష్ట్ర టూరిజం అధికారులు దృష్టి పెట్టారు. ఎంత విస్తీర్ణంలో కొండ ఉంది. అభివృద్ధి చేయడానికి ఎంత భూమి అనువుగా ఉందో వివరాలను కోరారు. ఈ క్రమంలో మంగళవారం జిల్లా టూరిజం అధికారి గౌరి, ఆర్డీవో శ్రీనివాసులు, మండల సర్వే బృందంతో కలిసి సర్వే చేపట్టారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.81.25 లక్షల ఆదాయం


టెండర్లు నిర్వహిస్తున్న ఈవో కిషోర్

ఐరాల(కాణిపాకం), జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి మంగళవారం నిర్వహించిన పలు సీల్డ్, ఆన్‌లైన్ టెండర్లు, బహిరంగ వేలంతో రూ.81,25,200 ఆదాయం లభించినట్లు ఈవో కిషోర్ తెలిపారు. ఈ టెండర్లలో తలనీలాలు పోగు చేసుకునే హక్కును హెచ్చు పాటదారుడు రూ.71,00,000కు దక్కించుకున్నారు. ఆలయ కల్యాణ కట్ట ఎదురుగా బంకు నిర్వహణ హక్కును మరొకరు రూ.5,00,200కు దక్కించుకున్నారు. శివాలయం ఎదుట ఉన్న పార్కు, ఆలయ పరిసరాల్లో ఫొటోలు తీసే హక్కును ఇంకొకరు 5,25,000 కైవసం చేసుకున్నారు. వీరంతా ఏడాదిపాటు ఈ పనులు చేసుకోవచ్చని ఈవో తెలిపారు. కార్యక్రమంలో డీఈవో సాగర్‌బాబు, ఏసీ చిట్టెమ్మ, ఏఈవోలు ప్రసాద్‌బాబు, రవీంద్రబాబు, ధనపాల్, హరిమాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

పాలసముద్రం, జూలై 15(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ రైతు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. పాలసముద్రం మండలంలోని నిశ్శంకాపురానికి చెందిన రాజశేఖర్(33) తన చెరకుతోటకు నీళ్లు పెట్టడానికి బోరుబావి వద్దకు మంగళవారం వెళ్లాడు. మోటర్ ఆన్‌కాక పోవడంతో స్టార్టర్‌ను మరమ్మతులు చేయడానికి ప్రయత్నించగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

'స్మగ్లింగ్'పై ఉక్కుపాదం మోపండి

- అధికారులకు ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ పరిధిలో గంజాయి, బియ్యం, గ్రావెల్, ఇసుక స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని అధికారులను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశించారు. ఇటీవల స్టోన్‌డస్ట్ ముసుగులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లను సీజ్ చేసిన అధికారులను అభినందించారు. మంగళవారం నియోజకవర్గంలోని రెవెన్యూ, పోలీసు అధికారులతో నగరి ఆర్డీవో కార్యాలయంలో ఆయన సమీక్షించారు. నగరికి 45 కిలోమీటర్ల దూరంలో విమానాశ్రయం వచ్చే అవకాశం ఉందని, విజయపురం మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సామాన్యుడికి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. నిరుపేదలను గుర్తించాలని.. వీలైనంత మందికి ఇంటి పట్టాలిచ్చి, పక్కాగృహాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. డీఎస్పీ అజీజ్, సీఐలు విక్రమ్, భాస్కర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ధరలున్నా.. తెగుళ్ల శాపం..!

● 'ఊజీ'తో టమోటాకు నల్లటి మచ్చలు


టమోటా తోటల్లో పండ్లపై నల్లని మచ్చలు

సోమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా సాగు చేసే టమోటా రైతుల్లో ఆందోళన నెలకొంది. సీజన్‌తో సంబంధం లేకుండా రైతులు టమోటా సాగుపై మొగ్గు చూపుతున్నారు. సోమల మండలంలో విస్తారంగా టమోటా సాగు చేపట్టారు. గత సీజన్‌లో రికార్డుస్థాయిలో ధరలు పలికిన టమోటా సాగుపై మక్కువ పెంచుకున్న రైతన్నలు సోమల, నంజంపేట, కందూరు, నెల్లిమంద, నడింపల్లె, ఇరికిపెంట, అన్నెమ్మగారిపల్లె తదితర పంచాయతీల్లో సుమారు 3,600 ఎకరాల్లో గత డిసెంబరు నుంచి విడతల వారీగా సాగు చేపట్టారు. 15 కిలోల బాక్సు జూన్ నెల వరకు రూ.30 నుంచి రూ. 60 మాత్రమే పలికి రైతులు నష్టాల పాలయ్యారు. కొందరు రైతులు కోత కూలీలు, రవాణా ఖర్చులు కూడా రాక చేతి నుంచి చెల్లించారు. మరికొందరు తోటల్లోనే కాయలను పశువులకు మేతగా వదిలేశారు. ఫిబ్రవరి, మార్చి వరకు నాట్లు వేసిన తోటల్లో దిగుబడులు వచ్చిన రైతులు ఎకరా సాగుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేసి నష్టపోయారు. ఏప్రిల్ నెలలో నాట్లు వేసిన తోటల్లో జూలై నెలలో దిగుబడులు వచ్చిన రైతులకు మాత్రమే 15 కిలోల బాక్సు రూ.100 నుంచి రూ.300 చేరుకోవడంతో పెట్టుబడులు మాత్రమే చేతికి అందాయి. ఈ సమయంలోనే వాతావరణం అనుకూలించక తోటల్లో పలు రకాల చీడపీడలు ఆశించడంతో వారంలో రెండు సార్లు మందులను పిచికారీ చేస్తూ వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. 100 బాక్సుల్లో 50 బాక్సులు ఊజీ ఈగల దాడులతో దెబ్బతిన్న కాయలు, నల్లమచ్చ కాయలు ఉండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఎండల తీవ్రతతో మొక్కలు ఎదుగుదల లేక పలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు, నాలుగు సార్లు కోతలు కోస్తే దిగుబడులు తగ్గిపోతున్నాయి.ఈ పరిస్థితిలో నష్టాలే మిగులుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. టమోటాకు నల్లమచ్చలు, ఆకుముడత, తెల్లదోమ, పచ్చదోమలు వ్యాప్తి అధికంగా ఉండి మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోవడం, ధరలు ఉండి టమోటాలో నాణ్యత లేకపోవడంతో నష్టాలు చవిచూస్తున్నారు. టమోటా సాగుకు బిందుసేద్యం, కట్టెలు నాటడం, దారం వంటి ఖర్చులు పెరగడం, వాతావరణం అనుకూలించక వైరస్ ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టమోటా తోటల్లో ఊజీ ఈగలు బెడదతో కోతలు చేయకుండానే తోటల్లోనే పండ్లను వదిలేస్తున్నారు.ధరలు కొంత ఊరటగా ఉన్నా ఊజీ ఈగలు, నల్లమచ్చ తెగుళ్లతో నష్టపోతున్నారు.

దేవదాయశాఖ కార్యాలయం తరలింపు యత్నం


శ్రీపురం సత్రంలో సిద్ధమవుతున్న దేవదాయశాఖ నూతన కార్యాలయం

చిత్తూరు కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా దేవదాయ శాఖ కార్యాలయాన్ని తరలించేందుకు ఆ శాఖ ఏసీ చిట్టెమ్మ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నగరంలోని చర్చివీధిలో జీవ కారుణ్య సమాజ కార్యాలయంలో అద్దె చెల్లించి దేవదాయ శాఖ కార్యాలయాన్ని నడుపుతున్నారు. అయితే సంతపేట దేవదాయ శాఖకు చెందిన శ్రీపురం సత్రం స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలోకి అద్దె ప్రాతిపదికన కార్యాలయాన్ని మార్చాలనే నిర్ణయం తీసుకున్నారు.చర్చివీధిలో కార్యాలయమైతే బస్టాండ్, రైల్వే స్టేషను నుంచి వచ్చి పోవడానికి సౌకర్యంగా ఉంటుందని సందర్శకులు అభిప్రాయపడుతున్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలనూ ప్లాస్టిక్ సర్జరీతో సరి చేయొచ్చు

తిరుపతి(వైద్యం), జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ సర్జరీ అనేది కేవలం అందాన్ని మెరుగుపరచడమే కాకుండా ప్రమాదాలు, గాయాలు లేదా పుట్టుకతో వచ్చే కొన్ని లోపాలను సరిచేయడంలో దోహదపడుతుందని రుయా ప్రొఫెసర్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రరెడ్డి అన్నారు. ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్లతోపాటు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్లాస్టిక్ సర్జరీలో అధునాతన పద్ధతులు వాటి ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం ప్లాస్టిక్ సర్జన్లను స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ సన్మానించి జ్ఞాపికలను అందించారు. పముఖ ప్లాస్టిక్ సర్జన్లు ప్రవీణ్, ఝాన్సీ విజయ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

9 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. పలమనేరులో 13.2, గంగవరంలో 8.4, సోమలలో 4.6, పెద్దపంజాణిలో 4.2, పుంగనూరులో 3.6, నింద్రలో 3.2, పులిచెర్లలో 3, వి.కోటలో 2.6, బంగారుపాళ్యంలో 2.2 మి.మీ వర్షం కురిసింది.

25వరకు పీ-4 గ్రామ, వార్డు సభలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా పీ-4 విధానాన్ని ప్రభుత్వం రూపొందించిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్ నుంచి నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 65,451బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు.ఈ జాబితాను పునఃపరిశీలన చేసి తుదిజాబితాను సిద్ధం చేయాలన్నారు. ఇందుకోసం సచివాలయ సిబ్బంది ద్వారా మంగళవారం నుంచి ఈనెల 25వ తేది వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 15 నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకునివెళ్ళి రూట్స్ యాప్ ద్వారా వివరాలు సేకరించి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో శ్రీనివాసులు, ఏడు నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి కేసులో లొంగిపోయిన నిందితుడు

చిత్తూరు లీగల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి కేసులో నిందితుడుగా ఉన్న శంకర ఆచారి మంగళవారం చిత్తూరు కోర్టులో లొంగిపోయాడు. ఈనెల 9వ తేదిన బంగారుపాళ్యం మార్కెట్‌యార్డులో శివకుమార్ ఫొటోలు తీస్తుండగా కొంతమంది వైసీపీ మూకలు అతనిపై దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో రెండవ ముద్దాయిగా వున్న ఏపీ శంకర ఆచారి పరారీలో ఉంటూ మంగళవారం సాయంత్రం చిత్తూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న పీడీఎం కోర్టులో లొంగిపోయాడు.న్యాయమూర్తి ఉమాదేవి అతనికి ఈనెల 24 వరకు రిమాండ్ విధిస్తూ పోలీసులకు అప్పగించారు.

వేడుకగా అమ్మవారికి ఉయ్యాల సేవ



తిరుచానూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సహస్ర దీపాల వెలుగులో పద్మావతి దేవికి అత్యంత వేడుకగా ఊంజల్ సేవ మంగళవారం నిర్వహించారు. అర్చకులు సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని మండపానికి వేంచేపు చేసి ఊంజల్‌పై కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ సహస్ర దీపాలంకరణ వెలుగులో పద్మావతి అమ్మవారికి నేత్రపర్వంగా ఊంజల్ సేవ జరిగింది. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, సుభాస్కర్ నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పాఠశాల క్రీడాస్థలం కబ్జా..!

● 'పీజీఆర్ఎస్'లో ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



ఆక్రమణకు గురవుతున్న క్రీడామైదానం

పుంగనూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని గూడూరు పల్లె జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాస్థలాన్ని పలువురు కబ్జా చేస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత 30 ఏళ్లుగా హైస్కూల్ విద్యార్థులు రోజూ గ్రామంలో సర్వేనంబర్ 323/3లోని 5 సెంట్లు భూమిలో క్రీడామైదానంగా ఉపయోగించుకుంటున్నారు. పాఠశాలలో 340 మంది విద్యార్థులు చదువుతుండగా కేవలం ఆ 5 సెంట్ల స్థలంలో ఆడుకుంటున్నారు. అయితే ప్రస్తుతం భూమి విలువ పెరగడంతో కొంతమంది ఆటస్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కబ్జాకాకుండా కాపాడాలని పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రమణ సోమవారం 'పీజీఆర్ఎస్'లో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. అలాగే గ్రామస్తులు రెడ్డెప్ప, చెంగారెడ్డి, ఈశ్వర్, వెంకటరమణ, బాషా, నరసింహులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి జిల్లా విద్యాశాఖాధికారి, తహసీల్దార్, సీఐకి ఫిర్యాదు చేశారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు

పలమనేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు ఆదేశించారు. మంగళవారం పలమనేరులోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిల్వలు, రసీదు పుస్తకాలు, రికార్డులు పరిశీలించారు. ఎరువులు , విత్తనాలు, పురుగుమందులకు సంబంధించిన నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపాలని వ్యవసాయశాఖ అధికారులను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ధనంజయరెడ్డి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవి, ఏవో సంధ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఈ-చెత్త ఆటోలు



మున్సిపల్ తాగునీటి ఫిల్టర్ సంప్ సమీపంలో ఉంచిన ఆటోలు

పలమనేరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో చెత్త తరలించేందుకు మూడేళ్ల క్రితం అప్పటి వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేసి పంపిన ఈ చెత్త ఆటోలు అప్పుడే మరమ్మతులకు గురై మూలన పడ్డాయి. మున్సిపాలిటీకి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 8 ఈ-ఆటోలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ప్రస్తుతం మూడు ఈ-ఆటోలు మూలన పడ్డాయి. నాణ్యత, నిర్వహణ లోపాల కారణంగా నేడు నిరుపయోగంగా మారాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పుంగనూరు ఎస్ఐగా హరిప్రసాద్



సీఐ సుబ్బరాయుడును కలిసిన ఎస్ఐ హరిప్రసాద్

పుంగనూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా హరిప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ లోకేశ్ ఇటీవల చిత్తూరు వీఆర్‌కు వెళ్లడంతో చిత్తూరు వీఆర్‌లో ఉన్న ఎస్ఐ హరిప్రసాద్‌ను ఎస్పీ మణికంఠ పుంగనూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు.

పుంగనూరు-బెంగళూరు ఆర్టీసీ సర్వీసు నడపాలి



ఆర్టీసీ డిపో మేనేజర్ పావనికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నుంచి కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు ఆర్టీసీ సర్వీసును నడపాలని బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు డీఎం పావనికి మంగళవారం వినతిపత్రం అందించారు. రోజూ పుంగనూరు నుంచి బెంగళూరుకు ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, వివిధ పనులపై వందల సంఖ్యలో ప్రయాణికులు వెళ్తున్నారని.. ఉదయం నడిచే ఆర్టీసీ సర్వీసు నిలిపేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, బెంగళూరు ఆర్టీసీ సర్వీసులను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో పోకల తాతయ్య

కల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మరింత నాణ్యతగా ఉండాలని ఎంఈవో పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం తప్పక అందించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యా ప్రమాణాలపై సమీక్షించారు. హెచ్ఎం హరిశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ నేత పుట్టినరోజు వేడుకలు

పలమనేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలోని కార్మిక సంఘ నాయకులు, సిబ్బంది కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో రీజనల్ నాయకులు, జోనల్ నాయకులు, డిపో నాయకులు పాల్గొన్నారు.

పీఈఎస్‌లో రాయితీ వైద్య సేవలు

కుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ ఆస్పత్రిలో డయాబెటిక్ అండ్ ఎండోక్రైనాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు రాయితీతో కూడిన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్కే.సుబ్రహ్మణ్య తెలిపారు. సంబంధిత విభాగాధిపతి ఆధ్వర్యంలో చక్కెర వ్యాధి, గర్భధారణ మధుమేహం, థైరాయిడ్ సమస్యలు, లిపిడ్/కొలెస్ట్రాల్ సమస్యలు, ఇన్సులిన్ పెంపు, ఆస్టియోపోరోసిస్, కాల్షియం రుగ్మత, రక్తపోటు, పిట్యూటరీ, అడ్రినల్ రుగ్మతలతోపాటు ఇతర హార్మోన్ సమస్యలకు 20 శాతం రాయితీతో వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఆయా సమస్యలతో బాధపడుతున్న వారు పీఈఎస్ స్పెషాలిటీ ఆస్పత్రి డయాబెటిక్ విభాగంలో ఈ సేవలు పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు ఫోన్‌నంబర్ 9100773477 ను సంప్రదించాలని కోరారు.

పాదయాత్ర భక్తులకు అల్పాహారం

సోమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలం పత్తికొండకు చెందిన వేంకటేశ్వరస్వామి భక్తులు కాలినడకన తిరుమలకు వెళ్తుండగా మంగళవారం సోమల అభయాంజనేయస్వామి ఆలయంలో సేదతీరారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సంకీర్తనలు ఆలపించారు. దీంతో సోమల శివాలయం రాయల్ యువత భక్తులకు అల్పాహారం, తాగునీటి బాటిళ్లు అందించారు. అలాగే కర్ణాటక రాష్ట్రం నుంచి పలువురు కాలినడకన తిరుమలకు పాదయాత్ర చేస్తున్న భక్తులకు ట్రాన్స్‌కో జేఎల్ఎం నవీన్ రాయల్, స్వప్న అల్పాహారం అందజేశారు.

ఉపాధి పనుల పరిశీలన



అబకలదొడ్డిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్

శాంతిపురం, జూలై 15 (ఆంధజ్యోతి): మండలంలోని అబకలదొడ్డిలో ఉపాధి పనులను ఎంపీడీవో కుమార్ మంగళవారం పరిశీలించారు. కూలీలకు రోజూ రూ.300 గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని క్షేత్రసహాయకులను ఆదేశించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండేలా పనులు చేయించాలని.. కూలీలకు అడిగిన వెంటనే పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు.

గుడుపల్లె పీఏసీఎస్ చైర్మన్‌గా రమేష్



గుడుపల్లె, జూలై 15 (ఆంధజ్యోతి): గుడుపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడిగా కొడతనపల్లెకు చెందిన రమేష్ నియమితులయ్యారు. రమేష్ కొడతనపల్లె సర్పంచ్‌గా పనిచేశారు. టీడీపీ చిన్నగొల్లపల్లె యూనిట్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. మండల కురుబ సంఘం నాయకులుగా వ్యవహరిస్తున్నారు. సంఘం సభ్యులుగా వేపమానుకొత్తూరుకు చెందిన వెంకటేష్, సంగనపల్లెకు చెందిన కృష్ణప్ప నియమితులయ్యారు.

వేలంతో ఆలయానికి రూ.8.94 లక్షల ఆదాయం



సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వేలంలో పాల్గొన్న పాటదారులు, కమిటీ సభ్యులు, నాయకులు

గుడుపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గుడివంకలోని సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవాల కోసం మంగళవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన వేలంలో ఆలయానికి రూ.8.94 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ పేర్కొంది. లడ్డూ విక్రయం ద్వారా రూ.5.54 లక్షలు, అంగళ్ల గేటు వసూళ్లు రూ.1.34 లక్షలు, తలనీలాలు రూ.2.5 లక్షలకు వేలంలో పాటదారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

పుంగనూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈనెల 16 నుంచి 23 వరకు పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలపై ఉచిత బ్రిడ్జి కోర్సుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే విధానాలు, సూచనలు, మార్గదర్శకాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని.. ఇతర వివరాలకు ఫోన్‌నంబర్ 9652421627ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం



రామకుప్పం: కొటారిగడ్డలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనాథరెడ్డి



రొంపిచెర్ల : వారణాసివారిపల్లెలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

రామకుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల మాజీ ప్రచార కార్యదర్శి ఆనందరెడ్డి, బందార్లపల్లె పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి తెలిపారు. మంగళవారం బందార్లపల్లె, కొటారిగడ్డ గ్రామాల్లో వారు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. నేతలు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి, హనుమంతు, బాలు, లోకనాథరెడ్డి, నరేష్‌రెడ్డి, పురుషోత్తం, హైదర్, బాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు, టీడీపీ మండలాధ్యక్షుడు ఉయ్యాల రమణ అన్నారు. మంగళవారం రొంపిచెర్ల పంచాయతీ వారణాసివారిపల్లెలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్, నాయకులు రాజేంద్రప్రసాద్, అంజాద్‌ఖాన్, షేక్ కరీముల్లా, నాగిశెట్టి రామమూర్తి పాల్గొన్నారు.

● **సోమల:** చంద్రబాబు పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు పేర్కొన్నారు. మంగళవారం సూరయ్యగారిపల్లెలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సోమల సింగిల్ విండో ఛైర్మన్ శివశంకర్, మహేంద్రబాబు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల మాజీ ప్రచార కార్యదర్శి ఆనందరెడ్డి, బందార్లపల్లె పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి తెలిపారు. మంగళవారం బందార్లపల్లె, కొటారిగడ్డ గ్రామాల్లో వారు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. నేతలు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి, హనుమంతు, బాలు, లోకనాథరెడ్డి, నరేష్‌రెడ్డి, పురుషోత్తం, హైదర్, బాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



బైరెడ్డిపల్లె: తీర్థంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



పుంగనూరులో జ్వరాలపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

పుంగనూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డెంగీ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుంగనూరు వైద్య యూనిట్ అధికారి గంగయ్య సూచించారు. మంగళవారం స్థానిక దోబీ కాలనీలో ప్రజలకు జ్వరాలపై అవగాహన కల్పించి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రత తోనే దోమలు పెరిగి జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న నీటి తొట్టెలను వారంలో ఒక రోజు శుభ్రం చేసి ఆరబెట్టుకోవాలన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల వద్దకు వెళ్లరాదని, ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంవో దేవప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ తేజోమూర్తి, సోమశేఖర్, ఏఎన్ఎం హేమలత, లలిత తదితరులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరమని.. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి అరుణ్‌కుమార్ సూచించారు. జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని తీర్థం గ్రామంలో పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి కాంతమ్మ, పీహెచ్ఎన్ శమంతక, సూపర్‌వైజర్ తిరుమలమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో కోడలి అరెస్టు



సరస్వతమ్మను అరెస్టు చూపుతున్న మహిళా పోలీసులు

చౌడేపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మామపై దాడి చేసి గాయపరిచిన కేసులో మంగళవారం కోడల్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు... ఏకొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లెకు చెందిన చిన్నపరెడ్డిని అతని కుమారుడు మనోహర్, కోడలు సరస్వతమ్మలు గత మార్చి 30న దాడి చేసి తీవ్రంగాగాయపరిచారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన ఏప్రిల్ 9 ఇంటికొచ్చినా తీవ్ర మనోవేదనతో చిన్నపరెడ్డి ఏప్రిల్ 21న మృతి చెందాడు. అప్పటి నుంచి ఉమారుడు మనోహర్, కోడలు సరస్వతమ్మ పారివడంతో ఇటీవల మనోహర్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపారు. పరారీలో ఉన్న సరస్వతమ్మను మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

అప్పుల బాధతో జిమ్ నిర్వాహకుడి ఆత్మహత్య

పుంగనూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి బెంగళూరులో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు... పుంగనూరు మండలం అరడిగుంట పంచాయతీ జౌకొత్తూరుకు చెందిన యువరాజ్ కుమార్ కార్తీక్ (26) బెంగళూరులో జిమ్ నిర్వహిస్తున్నాడు. జిమ్ నిర్వహణలో అప్పులు అధికంగా చేయడం, వారి నుంచి ఒత్తిడి రావడంతో ఇటీవల బెంగళూరు నుంచి స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈనెల 9న పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు గుర్తించి బెంగళూరులో ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

చట్టాన్ని వందశాతం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

శాంతిపురం, జూలై 15 (ఆంధజ్యోతి): కుప్పంలో భూసేకరణ చట్టాన్ని వంద శాతం అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శాంతిపురంలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ఎయిర్‌పోర్టు కోసం ప్రభుత్వం భూములను సేకరిస్తుందని.. 2013 భూసేకరణ చట్టాన్ని పాటించలేదని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చిన అనంతరం ఎనిమిది వారాల గడువు ఇవ్వాలని... అలా కాకుండా 15 రోజులు గడువు ఇచ్చారని చెప్పారు. రైతుల అంగీకారంతో భూములు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, రైతు లు పాల్గొన్నారు.

ఉనికి కోసమే ప్రభుత్వంపై విమర్శలు



మాట్లాడుతున్న ముల్లంగి వెంకటరమణ

కల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు, విధ్వంసాలు, అక్రమ కేసులు కొనసాగాయని రాష్ట్ర టీడీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ, సింగిల్ విండో అధ్యక్షులు ధనంజయనాయుడు తెలిపారు. పులి చెర్ల మండలం కల్లూరు జడ్పీ బంగ్లాలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలవుతున్నాయన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అమలువుతున్నాయని, పథకాల అమలుపై వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సూపర్‌సిక్స్ అమలుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. తోతాపురి కిలోకు రూ.4 ప్రకటించి మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుందన్నారు. వైసీపీ తన ఉనికిని చాటుకునేందుకే బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ పేరుతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశాలు నిర్వహించడం దారుణమన్నారు. వైసీపీ అరాచక పాలనతోనే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, మురళీధర్‌నాయుడు, మహేష్, నూర్‌బాషా, కరుణాకర్‌నాయుడు, అష్రఫ్, ఖాదర్‌వల్లి, మునిరత్నం, బాబయ్య, రాజేష్ పాల్గొన్నారు.

మామిడితోటలో వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన సుబ్రహ్మణ్యం

వి.కోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం గెస్తింపల్లె సమీపంలోని ఓ మామిడితోటలో కాపలాగా ఉంటున్న సుబ్రహ్మణ్యం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాలకల్లు పంచాయతీ కపట్లబండకు చెందిన వెంకట్రామణప్ప కుమారుడు సుబ్రహ్మణ్యం భార్యాపిల్లలతో మామిడితోటలో కాపలాగా ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తోటలోని ఓ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించిచారు. తన భర్త మృతిపై విచారణ జరిపి న్యాయం తనకు చేయాలని మృతుడి భార్య పోలీసులను వేడుకుంది.

గంగమ్మా.. కావగరావమ్మా!

● రామకుప్పంలో వైభవంగా పచ్చిగెరిగె ఊరేగింపు ● భక్తిశ్రద్ధలతో భక్తుల అగ్నిగుండ ప్రవేశం



పచ్చిగెరిగెను అనుసరిస్తున్న దేవతామూర్తులు



రామకుప్పం పట్టణ వీధుల్లో ఊరేగుతున్న పచ్చిగెరిగె

రామకుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని గ్రామదేవత దిగువవీధి గంగమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన పచ్చిగెరిగె ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. పట్టణ శివార్లలోని సల్లాపురెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మంగళ వాయిద్యాలు, డప్పుల హోరు, బాణసంచా పేలుళ్ల మధ్య పచ్చిగెరిగ ఊరేగింపు ప్రారంభించారు. గంగమ్మ, పోతులరాజు, సల్లాపురెమ్మ, అమ్మవారి శిరస్సు ఉత్సవర్లు పచ్చిగెరిగెను అనుసరించాయి. భక్తులు అడుగడునా పచ్చిగెరిగెకు పూజలు నిర్వహించారు. రాత్రి దిగువవీధి గంగమ్మ ఆలయం వద్దకు పచ్చిగెరిగె చేరుకుంది. గోవింద నామస్మరణల మధ్య ప్రత్యేక పూజల అనంతరం పచ్చిగెరిగెతో పాటు వందలాది మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. స్థానికులు ఆలయాలను విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు.

పాలేటమ్మకు పూజలు

సోమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టుపల్లెలో పాలేటమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. ఇంటింటా మహిళలు అమ్మవారికి హారతులు పట్టారు. పోతురాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారి ప్రధాన అర్చకులు పాలేటి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వర్షాలు కురవాలని..

తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనడంతో వానలు కురవాలని గట్టువారిపల్లె గ్రామస్తులు మంగళవారం అక్కదేవతల ఆలయం వద్ద పూజలు చేపట్టారు. ‘రినార్లు పోసి వర్షం కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈక్రమంలోనే వర్షాలు కురవాలని అభిషేక పూజలు చేపట్టారు. ఆవులపల్లె పంచాయతీలోని పలు చెరువుల్లో నీటిమట్టం తగ్గిపోవడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితిని నేపథ్యంలో వరి నాట్లు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు.

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు



రొంపిచెర్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ లోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాభిషేకం, అర్చనలు, తమలపాకుల హారం వేసి పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే మురళీమోహన్



170 గొల్లపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

బంగారుపాళ్యం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ ఆధ్వర్యంలో కాటప్పగారిపల్లె, ఎద్దులవారిపల్లె, బోడబండ్ల, 170 గొల్లపల్లె, శెట్టేరి, తూంపాయనపల్లె, ఎన్.కోటూరు గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. శెట్టేరి గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తమ సమస్యలను తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పూతలపట్టు నియోజక వర్గ పరిశీలకుడు బొమ్మన శ్రీధర్, ఎంపీటీసీ గోమతి, నాయకులు ఎన్పీ జయప్రకాష్, జనార్థన్‌గౌడ్, కోదండయాదవ్, కోకా ప్రకాష్‌నాయుడు, రమేష్, సింగిల్ విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు, హరి, అశోక్, చంద్రయ్యనాయుడు, వాసుదేవనాయుడు, గజపతి, శెట్టేరి సర్పంచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై కోదండరాముడి విహారం



తవణంపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరు కోదండ రామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. ఉదయం స్వామివారికి తిరుమంజనం, క్షీరాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవర్లకు ఉంజల్‌సేవ నిర్వహించి.. సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, ఉభయదారులతోపాటు టి.పుత్తూరు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైసీపీ వినాశనం నుంచి కోలుకుంటున్న రాష్ట్రం: టీడీపీ



పెడకంటిపల్లె దళితవాడలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ వినాశనం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని టీడీపీ నాయకులు అన్నారు. పాపిరెడ్డిపల్లె పంచాయతీలోని పాపిరెడ్డిపల్లె, మారేడుపల్లె, తిమ్మిరెడ్డిపల్లె, పెడకంటిపల్లె, పెడకంటిపల్లె దళితవాడల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు కామసాని ఉమేష్‌రెడ్డి, ఎస్సీ సెల్ టీడీపీ ప్రధానకార్యదర్శి దేవసుందరం, మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ కామసాని విజయకుమార్‌రెడ్డి, రైల్వేకాంట్రాక్టర్ పోలు రుషేంద్రరెడ్డి, యువనేత హరీష్‌యాదవ్ ప్రసంగించారు. నేతలు కామసాని కోదండరెడ్డి, యాగమరెడ్డి, మునిరాజులయాదవ్, మాధవరెడ్డి, రుషేంద్రరెడ్డి, గిరిబాబురెడ్డి, జమీర్, నరసింహులు, చంద్ర, అల్లీబాబు, మునస్వామి, రాజేంద్రన్, గోపి పాల్గొన్నారు.

తెగుళ్లను తట్టుకునే పంటలను సాగుచేయాలి

యాదమరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెగుళ్లను తట్టుకునే పంటలను సాగుచేయాలని రైతులకు వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. మంగళవారం వరదరాజులపల్లె రైతుసేవా కేంద్రంలో రైతులతో ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సంధ్య, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మాధవి, మండల వ్యవసాయ అధికారి సీహెచ్ దీప, ఏఈవో మోక్షేశ్వరి సమావేశం నిర్వహించారు.

ఆలయ భూముల ఆక్రమణకు యత్నం



భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

శ్రీరంగరాజపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మంగుంట లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన భూములను కొందరు ఆక్రమించడానికి యత్నించారు. మంగుంట రెవెన్యూ లెక్కదాఖలో 109/1లో ఎకరం 27 సెంట్లు, 110/4లో ఎకరం 15 సెంట్లు, 110/13 0.69 సెంట్లు, 18/12లో 0.63 సెంట్ల భూమి ఆలయానికి చెందింది. ఈ భూమి విషయమై గతంలోనే గొడవ జరగడంతో ఆలయానికి అనుకూలంగా హైకోర్టు స్టే ఇచ్చింది. తాజాగా ఈ భూమి ఆక్రమించడానికి మంగళవారం కొందరు చదును చేస్తుండగా, స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. డీటీ రవికుమార్, వీఆర్వో మోహనలు సంఘటన స్థలానికి వచ్చి భూములను పరిశీలించారు. ఈ భూమిలోకి ఎవరూ ప్రవేశించకూడదని హెచ్చరించారు. ఏమైనా రికార్డులుంటే రెవెన్యూ కార్యాలయానికి రావాలని స్పష్టం చేశారు.

నేడు థామస్ పర్యటన

వెదురుకుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో బుధవారం ప్రభుత్వ విప్ థామస్ పర్యటిస్తారు. ఉదయం 10.30 గంటలకు కార్వేటినగరం మండలంలోని ఆలత్తూరు గ్రామ పంచాయతీ టీటీకండ్రిగలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు వెదురుకుప్పం మండలం గొడుగుచింత గ్రామంలో మృతి చెందిన టీడీపీ సీనియర్ నేత భాస్కర్‌నాయుడు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తారు.

రాధాకృష్ణుల ప్రేమ అజరామరం

చిత్తూరు కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాధాకృష్ణుల ప్రేమ అజరామరం అని అభయ్ హిందూ సేన వ్యవస్థాపకుడు రాధామనోహర్ దాస్ అన్నారు. నాగయ్య కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన కేవలామృతం ప్రవచనాల ముగింపులో భాగంగా ఆయన ఉపన్యసించారు. ప్రేమలేని పురాణాలు, కావ్యాలు, గాథలు ఉండవన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఇంటికెళ్లి రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు చేశారు. ఎమ్మెల్యే కుటుంబీకులను ఆశీర్వదించారు. చిత్తూరు నారాయణి సేవా సమితి సభ్యులు కళ్యాణ చక్రవర్తి, జీడి గోపి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలు సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో డీఆర్డీఏ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల తీరుతెన్నులపై డీపీఎం, ఏపీఎంలతో సమీక్షించారు. డ్వాక్రా సంఘాల అభివృద్ధికి బ్యాంకర్లు, అధికారులు చేయూతనందించాలన్నారు. డీఆర్డీఏ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో సంతోషంగా ప్రజలు

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



ప్రజలకు కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం టీడీపీ నేతలతో కలసి నగరంలోని 25, 26, 27, 28 డివిజన్ల పరిధిలోని అంబేడ్కర్ నగర్, బాలాజి నగర్, చామంతిపురం, వినాయకపురం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, కాజూరు బాలాజి, డివిజన్ నాయకులు శంకర్, దయాల్, రేఖ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోండి

● డీఎంహెచ్‌వో సుధారాణి



శిశు మరణాలపై వైద్యాధికారులను విచారిస్తున్న సుధారాణి

చిత్తూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులపై డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో గతనెలలో జరిగిన నాలుగు శిశు మరణాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సమీక్ష సమవేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటే శిశు మరణాలు జరగవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి హనుమంతరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేతో చర్చ



భానుప్రకాష్‌తో విజయపురం టీడీపీ నాయకులు

విజయపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విజయపురం పంచాయతీలో అభివృద్ధి పనులపై నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో టీడీపీ నాయకులు చర్చించారు. మంగళవారం ఎమ్మెల్యేను తిరుపతిలోని స్వగృహంలో కలిశారు. టీడీపీ బీసీ సెల్ అధికార రాష్ట్ర ప్రతినిధి చుక్కా ధనంజయయాదవ్, నాయకులు మురళీ, ప్రవీణ్, రమేష్‌యాదవ్, ప్రదీప్, చెంచయ్య, రఘు, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో ఆక్రమణల తొలగింపు



చిత్తూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు నడవటానికి వేసిన ఫుట్‌పాత్‌పై ఉన్న ఆక్రమణలను మంగళవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఎమ్మెల్యే జగన్మోహన్, కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశాలతో నగరంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం బస్టాండు రోడ్డు పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌ను చాలా మంది ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. ఈ అక్రమ నిర్మాణాలను ఏసీపీ నాగేంద్ర పర్యవేక్షణలో తొలగించారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి



భాస్కర నాయుడు (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం గొడుగుచింత మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు పైడి భాస్కర నాయుడు(70) మంగళవారం మృతి చెందారు. మండల టీడీపీ ఉపాధ్యక్షుడితోపాటు పలు పార్టీ పదవుల్లో సేవలందించిన భాస్కర నాయుడి మరణవార్త తనను కలచివేసిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ తెలిపారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఎస్ఆర్‌పురం ఏఎంసీ వైస్ ఛైర్మన్ రావిళ్ల దేవరాజులునాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, నీటి సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బీఎం రవి, సాతాల గుణశేఖర్‌యాదవ్, వరప్రసాద్, మనోహర్‌నాయుడు తదితరులు భాస్కర నాయుడి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'పీఎం సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో టీడీపీ క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జిలు, బ్యాంకు ప్రతినిధులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం సోలార్ విద్యుత్‌కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల సింగిల్ విండో ఛైర్మన్‌గా ప్రతాప్‌నాయుడు



గుడిపాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గుడిపాల సింగిల్ విండో ఛైర్మన్‌గా దేవపత్ని ప్రతాప్‌నాయుడిని నియమించారు. ఈయన వసంతాపురం గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. డైరెక్టర్లుగా 197రామాపురానికి చెందిన హరిప్రసాద్, కొత్తపల్లెకు చెందిన సెల్వినాథన్‌ను ఎంపిక చేశారు.

అరగొండ 'విండో' ఛైర్మన్, డైరెక్టర్లకు సన్మానం



తవణంపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అరగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా ఎంపికైన టీడీపీ నాయకుడు రంజిత్‌రెడ్డిని, డైరెక్టర్లు విజయ్‌కుమార్, వెంకటేష్‌లను మంగళవారం సన్మానించారు. నాయకులు రఘుపతి, మునీశ్వరరెడ్డి, నారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

'ఉపాధి' నిధుల రికవరీకి ఆదేశం

నింద్ర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.5.41లక్షలను రికవరీ చేయాలని పీడీ శివకుమార్ ఆదేశించారు. మంగళవారం నింద్రలో జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. తనిఖీ బృందం నివేదిక ఆధారంగా పనులు చేయకుండా చేసినట్లు చూపిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీడీ సునీల్‌కుమార్, ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, ఏపీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అప్పు చెల్లించే విషయమై ఇరువర్గాల ఘర్షణ

పాలసముద్రం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించే విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. పాలసముద్రం కాలనీకి చెందిన పయణి భార్య ఉమా వద్ద అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్ రూ.ఐదు లక్షలను అప్పుగా తీసుకున్నాడు. రెండేళ్లు గడుస్తున్నా తిరిగి చెల్లించక పోవడంతో ఉమా మంగళవారం లక్ష్మణ్ ఇంటివద్దకు వెళ్లారు. డబ్బు తిరిగిచ్చేయాలని కోరారు. ఈ క్రమంలో లక్ష్మణ్ తమ్ముడు దినకరన్ గొడవపడ్డాడు. ఉమా భర్త పయణి కల్పించుకుని దినకరన్‌ను చితకబాదాడు. దినకరన్ బావమరుదులైన రామ్మూర్తి, జీవ వచ్చి ఉమదంపతులను చితకబాదారు. ఈ ఘర్షణలో ఉమ, రామ్మూర్తి, జీవలకు గాయాలయ్యాయి. విషయం తెలియడంతో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప ఇరు వర్గాలపైనా కేసులు నమోదు చేశారు. గాయపడ్డవారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తాగుబోతు హల్‌చల్



తాగుబోతు వదిలి వెళ్లిన ద్విచక్ర వాహనం

ఐరాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇరువారం పల్లె శివారులోని పంట పొలాల వద్ద మంగళవారం ఓ తాగుబోతు హల్‌చల్ చేశాడు. పొలాల వద్ద రత్నమ్మ తన పశువులను మేపుతుండగా ఆమె వద్దకు ద్విచక్ర వాహనంలో ఓ వ్యక్తి వచ్చాడు. ఏవో వివరాలు అడుగుతుండగా అతడి వద్ద మద్యం వాసనవచ్చింది. భయపడ్డ ఆమె అతడిని చైన్‌స్నాచర్‌గా భావించి కేకలు పెట్టారు. సమీపంలో ఉన్నవారు పరుగున రావడంతో ఆ వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని వదిలి పరాయ్యాడు. ఊర్లోవారికి సమాచారం ఇచ్చినా ఆచూకీ తెలియరాలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

22 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన 22 మందికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. రెండ్రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 22 మంది మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసు నమోదు చేశారు. వీరిని మంగళవారం నాల్గవ అదనపు కోర్టు జడ్జి ఉమాదేవి ముందు ప్రవేశపెట్టారు. ఆమె ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

పోలీసుల పల్లె నిద్ర

యాదమరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మోర్దానపల్లె గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ.. గ్రామప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసులకు తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని చెప్పారు. ఎస్ఐ ఈశ్వర్, టీడీపీ నేత బెల్లం కొండ కార్తీక్ పాల్గొన్నారు.

పూతలపట్టు సింగిల్ విండో ఛైర్మన్‌గా జగన్నాథం



జగన్నాథం - వెంకటేసులు - ఇంద్రసేన

పూతలపట్టు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు సింగిల్ విండో ఛైర్మన్‌గా మూర్తిగానివూరు గ్రామానికి చెందిన జగన్నాథంను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. డైరక్టర్లుగా అమ్మగారిపల్లెకు చెందిన వెంకటేసులు నాయుడు, గొడుగుచింతకు చెందిన ఎం.గుణశేఖర్ రెడ్డిలను నియమితులయ్యారు. అలాగే ఎర్రచెరువుపల్లె సింగిల్ విండో ఛైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన ఇంద్రసేన నాయుడు, డైరెక్టర్లుగా అయ్యప్పగారిపల్లె పంచాయతీకి చెందిన సుబ్రహ్మణ్యం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన కిషోర్‌లను నియమించింది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

యాదమరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. యాదమరి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం భారత్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో స్వచ్ఛత సర్వేక్షణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకుడు వరదరాజులు, ఎంఈవో ప్రసాద్, హెచ్ఎం హేమలత, రవి మొదలి తదితరులు పాల్గొన్నారు.

కామరాజర్ జయంతి వేడుకలు



చిత్తూరులో కామరాజర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా ఈడిగ సంక్షేమ సంఘం నేతలు

చిత్తూరు కల్చరల్/గంగాధరనెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం కామరాజర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరులో జిల్లా ఈడిగ మహాజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అట్లూరి శ్రీనివాసులు, దొరబాబు గౌడ్, రంభా, లావణ్య, వాణి శేఖర్, ప్రశాంత్, శ్రీనివాసన్, దాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ● గంగాధరనెల్లూరు బస్టాప్ కూడలిలో జిల్లా నాడార్ సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రిటైర్ హెడ్‌మాస్టర్ రాజేంద్రపిళ్లై, అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయసూర్యన్, సభ్యులు వేలురాజన్, మరీశ్వరి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో నిషేధిత వస్తువులు విక్రయించొద్దు:సీఐ

పూతలపట్టు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో నిషేధిత వస్తువులను విక్రయించకూడదని పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ హెచ్చరించారు. మంగళవారం ఎస్వీసెట్ కళాశాల సమీపాన ఉన్న పలు దుకాణాలను తనిఖీ చేశారు.

ఇంటింటి చెత్త సేకరణలో అలసత్వం వహించొద్దు: జడ్పీ సీఈవో



డీపీవోతో కలిసి చెత్త సేకరణపై ఆరా తీస్తున్న రవికుమార్‌నాయుడు

వెదురుకుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఇంటింటి చెత్త సేకరణలో అలసత్వం వహించొద్దని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు ఆదేశించారు. మంగళవారం కార్వేటినగరం మండలం కత్తెరపల్లె గ్రామ పంచాయతీలో ఐవీఆర్ఎస్ పనులను జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సుధాకరరావుతో కలసి తనిఖీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ పంచాయతీల విధి విధానాలపై సూచనలు, సలహాలను ఇచ్చారు. చెత్త సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్వేటినగరం డిప్యూటీ ఎంపీడీవో బీవీ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి బి.జయప్రకాష్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

విజయపురం ఎస్ఐగా మహేష్‌బాబు

విజయపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విజయపురం ఎస్ఐగా మహేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ కార్యాయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇక్కడ పనిచేస్తుండిన రంగాను వీఆర్‌కు పంపారు. నూతన ఎస్ఐని టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, పలువురు టీడీపీ నాయకులు సత్కరించారు.

చెత్త సేకరణ పనుల తనిఖీ

పాలసముద్రం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వనదుర్గాపురంలో తడి, పొడి చెత్త సేకరణ పనులను మంగళవారం ఎంపీడీవో సతీష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలిచ్చారు. వీధి దీపాలు వెలుగుతున్నాయా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని మొండివెంగనపల్లె, నల్లవెంగనపల్లె పంచాయతీల్లో మంగళవారం చెత్త సేకరణ పనులను ఎంపీడీవో పురుషోత్తం తనిఖీచేశారు. కార్యదర్శులు లక్ష్మీనరసింహ, మునికృష్ణ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

గుడిపాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కోలావూరు, బసవాపల్లె రైతులు పండించిన వరి, వేరుశనగ పంటను జిల్లా ఏరువాక కేంద్ర శాస్త్రవేత సంధ్యారాణి, వ్యవసాయ అధికారి సంగీత మంగళవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కళాశాల మైదానం శుభ్రం



చిత్తూరు సెంట్రల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్ కణ్ణన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు శుభ్రం చేస్తున్నారు. మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో మైదానంలోని పిచ్చిమొక్కలను తొలగించి, క్రీడలకు సౌకర్యవంతంగా సిద్ధం చేస్తున్నారు. వీరికి ప్రిన్సిపాల్ సయ్యద్ మౌలా కృతజ్ఞతలు తెలిపారు.

'పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలి'

చిత్తూరు కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలని జిల్లా ప్రభుత్వ పెన్షన్ల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు బకాయి పడ్డ డీఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు. నాయకులు శివకుమార్, ప్రభాకర్ నాయుడు, విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరి సింగిల్‌విండో ఛైర్మన్‌గా బాలాజి



బాలాజి - జవహర్ - ఐవీ నాయుడు

నగరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నగరి సింగిల్‌విండో ఛైర్మన్‌గా టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలాజి, డైరెక్టర్లుగా జవహర్‌రెడ్డి, ఐ.వీ.నాయుడు ఎంపికైనట్లు సీఈవో తులసి పిళ్లై తెలిపారు.

వైద్యపరీక్షలు సకాలంలో నిర్వహించాలి

యాదమరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆరోగ్య సంరక్షణ పథకం కింద గ్రామాల్లో ప్రజలకు సకాలంలో వైద్యపరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని జిల్లా ఆర్బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ ఆదేశించారు. మంగళవారం మాదిరెడ్డిపల్లె పీహెచ్‌సీ, పత్రపల్లె సచివాలయ పరిధిలో జరుగుతున్న మధుమేహం, రక్తపోటు, ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఎంపీహెచ్‌ఈవో మునీంద్రరాజు, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అనర్హులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేయండి: టీడీపీ

గుడిపాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేయాలని మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి ఈమేరకు ఫిర్యాదు చేశారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ తనకు ఇష్టం వచ్చినట్లు డీకేటీ భూముల్లో అనర్హులకు ఇళ్ల పట్టాలను ఇచ్చారని ఆరోపించారు. విచారించి, వాటిని రద్దు చేయాలని కోరారు. మాజీ సర్పంచ్ ప్రతాప్‌నాయుడు, రైతుసంఘ నేత రంగారెడ్డి పాల్గొన్నారు.